# పెళ్ళి కుదిరింది

## —చేర్ల సీతాదేవి



ఆ రోజు చాలా చిరాకుగా వుంది రహీమ్‌కి.

సుల్తానా జరదా కిళ్ళీ బుగ్గన పెట్టుకుని పిల్లలకి కబుర్లు చెపుతోంది. ఆమె మాటలకు పగలబడి నవ్వుతున్నారు పిల్లలు. రహీమ్ సుల్తానా వైపు పరీక్షిస్తున్నట్టుగా చూశాడు.

పలచని జుట్టులో అక్కడక్కడ వెండితీగల్లా తెల్ల వెంట్రుకలు. గుండ్రటి మొహం. చిన్న కళ్ళు. నవ్వేటప్పుడు గారకట్టి కనిపించే చిన్న చిన్న వంకర పళ్ళు. కుదేసిన గుమ్మడికాయలా పిల్లలమధ్య కూర్చుంది సుల్తానా.

'మరే మా అమ్మా నాన్న ఆస్పత్రికి వెళ్ళారు. వొచ్చేవరకూ నీదగ్గరే వుండమంది మా అమ్మ' తలుపు చాటునుంచి ఓ పిల్లాడు. 'అలాగా రారా' అంటూ వాడ్ని రెక్క పట్టుకుని లాక్కుని వొళ్ళో కూర్చోబెట్టుకుంది. వాడిని ప్రశ్నలు వెయ్యటం మొదలుపెట్టింది.

రహీమ్‌కి పేపర్లో అక్షరాలు మాత్రం కనిపిస్తున్నాయంతే. అప్పటివరకూ సుల్తానా వొడిలో ఆడుకుంటున్న పసివాడు గొంతు పెద్దజేసి రాగం అందుకున్నాడు. సుల్తానా వాడ్ని భుజాన వేసుకుని తిప్పటం మొదలుపెట్టింది. సముదాయించలేక నానాయాతనా పడుతోంది.

'ఏమిటీ గొడవ ?' రహీమ్ విసుక్కున్నాడు.

"బాగుంది. పిల్లలన్నాక ఏడవరేమిటి ? వీడే నా కొడుకయితే భుజాన వేసుకుని తిప్పేవాడివి కావా ?" నిలదీసినట్టే అడిగింది

రహీమ్ పేపర్లో మొహం దాచుకున్నాడు.

"మరి నీకెందుకు పిల్లలు లేరు ?" పేపరు తప్పించి చూశాడు రహీమ్.

మా అమ్మా నాన్న ఆస్పత్రికి వెళ్ళారని చెప్పిన అబ్బాయి అన్నాడు.

"ఓరి పిచ్చినాగన్నా! ఎందుకు లేరూ అంటే దేవుడు యివ్వలేదు. నాకు పెళ్ళయి యిరవై ఏళ్ళయింది. కొడుకు వుంటే మీ పెద్దన్న లేడూ, రామం, అంత వుండేవాడు."

గోపి బుగ్గలు పుణికి ముద్దు పెట్టుకుంది సుల్తానా

రహీమ్ తలపట్టుకు కూర్చున్నాడు. "పిల్లల దగ్గర ఏం మాట్లాడాలో కూడా తెలీదు."

రహీమ్ ఇరవై ఏళ్ళ సంసార జీవితంలో చాలా సాయంత్రాలు యించుమించు ఒకేలాగ గడిచాయని చెప్పుకోవచ్చు. అతను ఒక హైస్కూల్ హెడ్‌మాష్టరు వుదయం పదినుండి సాయంత్రం నాలుగు వరకూ స్కూల్లో పిల్లలమధ్య, స్టాఫ్ కంప్లెయింట్లలో, బుర్ర తిరిగిపోతుంది. ఇంటి కొస్తాడు.

సరిగ్గా గడపదగ్గర నేలమీద చతికిలబడి వుంటుంది సుల్తానా. చుట్టూ పిల్లలుంటారు. రహీమ్ టీ కప్పు, పేపరు పట్టుకుని కిటికీ పక్కనే పడకుర్చీలో కూర్చుంటాడు. రోడ్డుమీద వొచ్చే పోయే జనం ఒక్కసారన్నా తలతిప్పి చూస్తారు.

రహీమ్ చిరాకుపడిపోతూ, "కొంపలో ఎక్కడా చోటులేనట్టు పిల్లల్ని పెట్టుకుని గుమ్మంలో కూర్చుంటావు. చూసి చూసి ఎవడో నీకు పిల్లల

కోడి అని పేరు పెడతాడు చూడు'' అని కోప్పడతాడు.

అతనా మాట అన్నప్పుడల్లా 'పెట్టుకోనీ తెలిసినవాళ్ళు గాడ్రాలు అంటుంటే పడటంలా ?' కొట్టి పారేస్తుంది సుల్తానా.

మధ్య మధ్య సుల్తానా 'యిదిగో విన్నావా ?' అంటూ పిల్లల్నించి సేకరించిన సమాచారం చేరవేస్తూ వుంటుంది. వాళ్ళని ఏ మాటలు అడగాలో ఏవి అడక్కూడదో అని లేదు.

ఇది రోజూవుండే కార్యక్రమమే అయినా కొద్ది రోజులుగా భరించలేకపోతున్నాడు అతను. కొన్నాళ్ళుగా అతను ఒక విషయం గురించి ఆలోచిస్తున్నాడు. అయితే ఒక నిర్ణయానికి రాలేకపోతున్నాడు. 'లాభం లేదు. మనసులో మాట రమణమూర్తికి చెప్పి అతని సలహా అడగాలి ! చివాలున కుర్చీలోంచి లేచి గదిలోకి వెళ్ళాడు. చెప్పులు వేసుకుని అద్దంలో చూసుకున్నాడు. 'నలభై అంటే ఎవరూ నమ్మరు. పెళ్ళి కానివాడిలా వుంటావు' అన్న శర్మ మాటలు గుర్తొచ్చి ధైర్యం వచ్చింది. నున్నటి చెంపల్ని నిమురుకున్నాడు. ఒత్తుగా నల్లగా వున్న క్రాఫుని పైపైన సర్దుకున్నాడు.

గుమ్మం దాటుతుండగా 'ఎక్కడికీ? తొందరగా వచ్చెయ్యి' గట్టిగా కేకపెట్టింది.

ఎప్పుడన్నా అవుతే అలాగే అన్నట్లు తల వూపేవాడు. యిప్పుడు మాత్రం వెనక్కి తిరిగి చూడలేదు.

రహీమ్ వెళ్ళేసరికి రమణమూర్తి పెద్ద కొడుక్కి లెక్కలు చెపుతున్నాడు. అతను యల్. ఐ. సి.లో సీనియర్ అసిస్టెంటు. ఏడేళ్ళ పాప ఎక్కాలు వల్లెవేస్తూంది. రెండేళ్ళ అబ్బాయి అతని వొళ్ళో వున్నాడు. లక్ష్మి చీరమీద ఏదో కుడుతున్నది. రహీమ్‌ని చూసి లోపలికి వెళ్ళింది.

రహీమ్ కుర్చీ లాక్కుని కూర్చున్నాడు. రమణ వొళ్ళోంచి బాబుని అందుకుంటూ 'నీ సంసారం చూస్తుంటే ముచ్చటేస్తుందోయ్ రమణా' అన్నాడు.

రమణ నవ్వి వూరుకున్నాడు.

లక్ష్మి టీలు తెచ్చింది. తర్వాత యిద్దరూ బయటికి బయలుదేరారు. దారిలో రహీమ్ చెప్పిందంతా శ్రద్ధగా విన్నాడు రమణ. కొద్దిసేపు ఇద్దరూ మాట్లాడుకోలేదు.

వున్నట్టుండి "మరి ఆవిడ, మీవాళ్ళు వొప్పుకుంటారా ?'' అదే విషయాన్ని ఆలోచిస్తున్నట్టుగా అడిగాడు రమణ.

"నేను చేసుకోబోయేది పిల్లలకోసం'' స్థిరంగా జవాబిచ్చాడు రహీమ్.

"కాస్త చదువుకుని, సంస్కారం వుండి, అనాకారి కాకుండా వుంటే చాలు. కులం, జాతి పట్టింపులేదు'' ఆ మాటకి రమణ తలతిప్పి రహీమ్ మొహంలోకి చూశాడు.

"ఎలా ప్రొసీడ్ అవాలో సలహా యివ్వు'' తన నిర్ణయానికి తిరుగులేదన్నట్లు మాట్లాడాడు.

చాలా దూరం మౌనంగా నడిచారు.

"పేపరుకి యిస్తే బాగుంటుందేమో. మంచి మాచ్ చూసి సెలక్టు చేసుకోవచ్చు.''

ఆ ఆలోచన రహీమ్‌కి నచ్చింది. ఆ విషయమే మాట్లాడుతూ యింటి ముఖం పట్టారు.

* * *

మత్తేభాలవంటి మేఘాలు, గర్జనలు, మెరుపులు లేకుండా పిడుగుపడితే ఆశ్చర్యపోతారు. రహీమ్ మాటకి సుల్తానా అలానే నిశ్చేష్టురాలై నిలబడింది. సుల్తానా ఆ స్థితినుంచి తేరుకోక మునుపే రహీమ్ అందుకున్నాడు మళ్ళీ —

"నాలుగేళ్ళుపోయాక కాలో చెయ్యో పడి మంచాన పడితే ఎవరు చూడాలి ? నాకు పిల్లలు కావాలి. ఇప్పటికే ఆలస్యం చేశాననిపిస్తోంది.''

"పిల్లలు పుట్టకపోతే అది నా తప్పా ? నాకు మాత్రం తల్లిని కావాలని లేదా? మరి నా గతేమిటి?'' అంటూ ఏడుపు అందుకుంది సుల్తానా.

"కొంపలంటుకున్నట్టు ఏడుస్తావు దేనికి ? నీకు నేనేం అన్యాయం చెయ్యను. నెలకింత అవి పంపుతాను. హాయిగా పుట్టింట్లో కూర్చుని తిను.''

"నువ్వు నన్ను కొట్టు, తిట్టు. లేకపోతే యింత విషమిచ్చి చంపెయ్యి అంతేకానీ ఇంట్లోంచి మాత్రం పోను'' సుల్తానా ఏడుస్తూనే మొండిగా జవాబిచ్చింది.

రహీమ్ రెచ్చిపోయాడు.

"అరవగానే సరికాదు. ఏడాది గడువిస్తాను. కొడుకుని కనిస్తావా ? పెళ్ళి మానుకుంటాను.'' పెద్దగా అరిచాడు.

సుల్తానా ఏడుపు ఆపి రాయిలా నిలబడిపోయింది.

"నేను మంచివాడ్ని గనుక యీమాత్రం అవకాశమిచ్చాను. ఇంకోడయితే తలాక్ యిచ్చేసేవాడు.'' ఏమిటేమిటో అన్నాడు.

నాలుగు రోజుల ఘర్షణ అనంతరం బస్సెక్కించి పుట్టింటికి పంపేశాడు.

* * *


ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో మూడులైన్ల ప్రకటన కాలమ్‌కి మూడు వందల డెబ్భైఐదు రూపాయలు చెల్లించాడు రహీమ్. పదిహేను రోజుల తర్వాత పేపర్లో ప్రకటన వచ్చింది.


వారం తర్వాత ఒక వుత్తరం వచ్చింది. ఏమంత ఆశాజనకంగా లేదు. బొత్తిగా నిరుత్సాహపడిపోయాడు. నెలలోపు యిరవై వుత్తరాలు వచ్చాయి. అందులో ఒక వుత్తరాన్ని సెలక్టు చేశారు రమణా, రహీమ్ కలిసి. అందులో యిలా వుంది—

మీరు ముస్లిమ్ అయుండి జాతి పట్టింపు లేదు అంటూ యిచ్చిన మీ ప్రకటన నన్ను ఆకర్షించింది. నా పేరు నాగభూషణం నాయుడు. ఎగ్జిక్యూటివ్ యింజనీరుగా రిటయిరయ్యాను. నాకు ముగ్గురు పిల్లలు. పెద్దవాడు రాయవేలూరులో మెడిసన్ నాలుగో సంవత్సరం. రెండోవాడు మద్రాసు ఇంజనీరింగ్ కాలేజీలో రెండవ సంవత్సరం. అమ్మాయి బి. ఎ. చదువుతున్నది.

భారతి నా చెల్లెలు, బి. ఎ. బియిడి. కడప కాన్వెంట్‌లో ఎనిమిదవ తరగతి ఇంగ్లీషు టీచరుగా ఆరేళ్ళబట్టీ చేస్తున్నది. రెండేళ్ళ క్రితం క్రిస్మస్ పండుగనాడు స్కూటర్ యాక్సిడెంట్‌లో భర్తనీ, నాలుగేళ్ళ కొడుకునీ పోగొట్టుకుంది. ఇప్పుడు ఆమె వయసు ముప్ఫైరెండు సంవత్సరాలు. ఎత్తు ఐదు అడుగుల మూడు అంగుళాలు. చామనఛాయకు పిసరంత మంచి రంగే. ఆరోగ్యంగా వుంటుంది. కను ముక్కు తీరు గుణగణాలు నేను పొగడకూడదు.

మా తండ్రిగారు యిచ్చిన భూమి, విమల్ టెక్స్‌టైల్స్‌లో షేర్ రెండు లక్షల పైగా ఆస్తి వుంది. తల్లీతండ్రీ లేనందున నేనే గార్డియన్‌గా



## కార్టూనిస్టులకు సూచనలు!

- ★ కార్టూన్లను మంచి డ్రాయింగు కాగితంమీద ఇండియన్ యింకుతో గీసి పంపాలి
- ★ ప్రతీ కార్టూన్ వెనుక కార్టూనిస్టు పేరు, చిరునామా ఉండాలి.
- ★ వ్యంగ్య చిత్రాలు ప్రస్ఫుటంగా సాధ్యమైనంతవరకూ వాటిపై 'వ్యాఖ్య' చదవటానికి ముందే నవ్వించేవిగా అర్థవంతంగా వుండాలి!
- ★ వ్యాఖ్య చిన్నదిగా క్లుప్తంగా వుండాలి అక్షరాలు కుదురుగా మొదటిసారి చదివినప్పుడే అర్థం అవ్వాలి! కార్టూన్ మీద పేరూ వూరు అన్నీ రాస్తే అవి తిరస్కరింపబడే అవకాశాలుంటాయి.
- ★ సొంత చిరునామాగల తపాలా బిళ్ళలు అంటించిన కవరుగల కార్టూన్లను త్రిప్పిపంపడంజరుగుతుంది దారిలో పోయేవాటికి మా బాధ్యతలేదు.
- ★ ఎన్నుకొన్న కార్టూన్లలో అన్నీగాక కొన్ని మాత్రమే ఒక్కోసారి వేసుకోడం జరుగుతుంది పరిశీలనకు ఐదారువారాలు పట్టవచ్చు.
- ★ పండుగల కార్టూన్లు — బాగా ముందుగా వాటి కవరు మీద ఆ "ప్రత్యేక" సందర్భాన్ని పేర్కొంటూ పంపడం అవసరం
- ★ రంగుల కార్టూన్లు, పెన్సిలు బొమ్మలు, తెల్లకాగితంమీద వేసిన బొమ్మలు పంపవద్దని మనవి.
- ★ మా కార్యాలయానికి స్వయంగావచ్చి కార్టూన్లు అందజేసేవారు కూడా స్వంత చిరునామాగల స్టాంపులతికించిన కవరు జతచేయాలి. కాపీ కార్టూన్లు పంపరాదు.

— సం॥

## పెళ్ళి కుదిరింది

వ్యవహరిస్తున్నాను. ఆమెను పెళ్ళాడబోయే వ్యక్తి పెళ్ళితోపాటే ఆవిడ ఆస్తికి హక్కుదారు అవుతాడు.

మీకు జవాబు రాయడానికి ముఖ్య కారణం మావాళ్ళల్లో ఇంతవరకూ మతాంతర వివాహం చేసుకున్నవాళ్ళు ఎవరూలేరు. ఆ ఘనత మా కుటుంబానికి దక్కాలని. మా భారతి అభిప్రాయం కూడా యిదే.

మరో విషయం. మా భారతికి తెలుగు, ఇంగ్లీషు, సంస్కృతంతోపాటు హిందీ మాట్లాడనూ వ్రాయనూ వచ్చు. విశారద పరీక్ష పాసయింది.

మా భారతిని కంటికి రెప్పలా మీరు కాపాడుకుంటారన్న నమ్మకం కుదిరిననాడు మీ కివ్వడానికి నా కెటువంటి అభ్యంతరము వుండదు. మీ వివరాలు రాయగలరు.

స్నేహితులిద్దరూ సంప్రదించుకుని అతని వుత్తరానికి జవాబు రాసారు.

"మీ వుత్తరంలోని ప్లేన్‌నెస్ అండ్ ఫ్రాంక్‌నెస్ నన్ను ఆకట్టుకున్నాయి. మా తాత తండ్రులది పాకిస్తాన్. మా తండ్రిగారు వ్యాపార నిమిత్తం నిజామ్ స్టేట్‌కి వచ్చి యిక్కడే స్థిరపడిపోయారు.

నా విద్యాభ్యాసం యిక్కడే జరిగింది. గవర్నమెంటు హైస్కూల్ హెడ్మాష్టరుగా వున్నాను.

ముఖ్యంగా యీ వయసులో మళ్ళీపెళ్ళి ప్రసక్తి రావడానికి కారణం పిల్లలు లేకపోడం. ఇంతకాలం పెద్దగా ఈ లోపం తెలియలేదు.

ఇప్పుడు చాలా అనిపిస్తున్నది. నా మొదటి భార్య పుట్టింట్లో వున్నది. ఆమెకి నెలకి నూట యాభై రూపాయలు భరణం పంపే ఏర్పాటుచేసాను.

ఆమెవల్ల ఎటువంటి యిబ్బంది వుండదని హామీ యిస్తున్నాను

ఇక నా ఆస్తి వివరాలు : రజాకార్ సమయంలో మా తండ్రిగారు కొన్న యిల్లు, స్థలం రూపంలో, బ్యాంకులో యాభై వేల వరకూ వుంది.

నా గురించి నేను చెప్పకునేకన్నా మీరు స్వయంగా వచ్చి విచారిస్తే బావుంటుంది."

రమణకి భోళాగా గలగలా మాట్లాడే సుల్తానా గుర్తొచ్చింది. డెబ్బైకోట్ల భారతీయుల నాయకురాలిగా ఒక స్త్రీ చలామణీ అవుతున్న ఈ దేశంలో ఆడదానికున్న భద్రత ఏమిటి ?

వ్యాపార వస్తువుగా అమ్మబడుతోంది — కొనబడుతోంది. అనుభవింపబడుతోంది ... వదిలివేయబడుతోంది ...

*  *  *

రహీమ్ రాసిన ఉత్తరానికి నాగభూషణం నుంచి జవాబు వచ్చింది.

"పెళ్ళయితే వుద్యోగం చెయ్యనిస్తారా అని మా చెల్లెలి సందేహం. పెళ్ళి ఏ సాంప్రదాయ ప్రకారం జరపాలి ? మీ మొదటి భార్య యింట్లోనే వున్నా నా చెల్లెలు సర్దుకుపోగలదు. ఆమె అటువంటి గుణవతి.

మీరు తెలుగు చాలా బాగా వ్రాశారు. భాష విషయంలో మా చెల్లెలికి బెంగలేదు."

ఈ వుత్తరాన్ని కూడా రమణమూర్తికి చూపించాడు రహీమ్. అర్జంటుగా జవాబు రాసి పడేశాడు.

"భారతిని చేపట్టేందుకు సిద్ధంగా వున్నాను. అయితే — ఆస్తిపాస్తుల కోసం కాక ఒక యువతిని వుద్ధరించాలన్న ప్రోద్బలమే కారణం.

జాతి, సాంప్రదాయాలను అధిగమించి మీరు ఆలోచించిన తీరు, తీసుకున్న నిర్ణయం నాకెంతో నచ్చాయి. పెళ్ళి అనంతరం కూడా ఆమె ఆస్తి ఆమె పేరనే వుంటుంది.

పెళ్ళి ఏ సాంప్రదాయ ప్రకారం అన్న ప్రశ్న లేకుండా నలుగురి పెద్దల సమక్షంలో దండలు మార్చుకుని ఒక మంచి విందు యేర్పాటు చేస్తే బావుంటుందని నా అభిప్రాయం, ఇద్దరం పెళ్ళి ముచ్చట తీరినవాళ్ళమే గాబట్టి

ఉద్యోగ విషయంలో నాకు అభ్యంతరం లేదు. మీ చెల్లెలి ఫోటో పంపగలరు."

వారం తర్వాత భారతి అన్నగారు నాగభూషణం రాసాడు తాను త్వరలో బయలుదేరి రానున్నట్లు. గాలికన్నా వేగంగా యీ వార్త అందరికీ ఎలా తెలిసిందో తెలిసింది "లక్షాధికారిణి మిమ్మల్ని చేసుకోడానికి వొప్పుకున్నదటగా" అని ఎదురుపడ్డ పరిచయస్తుడల్లా రహీమ్‌ని అడగటమే.

రహీమ్‌కి గర్వంగా, సంతోషంగా వున్నది. ముందు జీవితం గురించిన ఊహలూ, ఆలోచనలూ ఎక్కువయ్యాయి.

"రమణా! ఎలాగయ్యా! ఆడవాళ్ళకి ఏవో భయాలు, సెంటిమెంట్లు వుంటాయిగా. నన్ను స్కూటర్ ఎక్కనివ్వదేమో. పెళ్ళయ్యాక సెకండ్ హేండ్ ఫియట్ కొనేస్తాను." తనకి తట్టిన ప్రతీ ఆలోచనా రమణమూర్తికి చెపుతున్నాడు.

ఇంటికి సున్నాలు వేయించాడు బడిపిల్లలచేత పెరడు శుభ్రం చేయించాడు. అతనొస్తే యేవిధమైన ఆతిధ్యం యివ్వాలో, ఎవరెవర్ని పరిచయం చెయ్యాలో పథకం వూహించి పెట్టుకున్నాడు.

*  *  *

రహీమ్ బడికి వెళ్ళడానికి తయారవుతున్నాడు ఎవరో తలుపు తడుతున్న చప్పుడవటంతో వెళ్ళి తెరిచాడు. ఎర్రగా, బక్కపలచగా, పొడవుగా వున్న వ్యక్తి ఎటాచీతో నిలబడివున్నాడు.

"మీరు... మీరు" సందేహిస్తూనే అడిగాడు రహీమ్.

"నాగభూషణం నాయుడ్ని. మీరేనా రహీమ్" అతను అడిగాడు.

'అవునవును.' రహీమ్ తడబడిపోయాడు. కంగారుపడిపోయాడు. కుంచించుకుపోయాడు.

అప్పుడు రహీమ్ వేషం —

గళ్ళలుంగీ, చేతుల బనీను, కుడిచేతిలో రేజర్, గడ్డానికి తెల్లగా నురుగు. మొదటిసారి ఆ విధంగా కనిపించవలసి వచ్చినందుకు మనసులో తెగ బాధపడిపోతూ పైకి మర్యాద వుట్టిపడే స్వరంతో,

"ఉత్తరం రాసుంటే స్టేషన్‌కొచ్చుండేవాడ్ని, ఇల్లు కనుక్కోడం యిబ్బంది కాలేదుకదా. రండి" అంటూ ఆహ్వానించాడు.

"ఇది మా భారతి ప్రపోజల్." నవ్వుతూ లోనికొచ్చాడు భూషణం.

భూషణం కూర్చోడానికి కుర్చీ చూపించి 'కాఫీ పుచ్చుకుంటారా' అడిగాడు.

"ముందు మీరు గడ్డం కానివ్వండి." చనువుగా జవాబిచ్చాడు భూషణం.

'ఒక్క నిముషం' అని గదిలోకి పరుగెత్తి గబగబా గీసుకోడంలో ముక్కుక్రింద పై పెదవిమీద కసుక్కున తెగింది. చూపుడువేలుతో నొక్కిపెట్టి ఎలాగో ఆ పని పూర్తిచేసాడు.

ఎక్కువ సమయం తీసుకుంటే ఆడపిల్లలా తయారయ్యాడనుకుంటాడని రెండు నిముషాల్లో స్నానం కానిచ్చి డ్రసప్ అయివచ్చాడు. పనిపిల్లకి రెండు రకాల టిఫిన్లు, నాలుగు కప్పుల స్ట్రాంగ్ కాఫీ పట్రమ్మని ఫ్లాస్కు, డబ్బులు యిచ్చి పంపాడు.

ఈలోగా యిల్లు చూపించాడు.

'దేవిడీలా వుంది. కానీ చాలా పాతది' అన్నాడు భూషణం.

ఇది అమ్మేసి చిన్నదైనా అన్ని కంఫర్ట్స వుండేలా యిల్లు కట్టాలన్న అభిప్రాయం వున్నట్లు చెప్పాడు రహీమ్

పనిపిల్ల ఫలహారాలు పట్టుకొచ్చింది.

"భారతి ఫోటోలు" అంటూ ఒక కవరు టేబుల్‌మీద వుంచాడు భూషణం.

కాఫీలు అయ్యేవరకూ ఎలాగో వోపిక పట్టి అప్పుడు కవరు తీసి చూసాడు. రెండు ఫోటోలు వున్నాయి ఒకటి బ్రెస్టు సైజుది. రెండవది ఫుల్ సైజుది.'

మంచి ఆరోగ్యంగా పుష్టిగా వుంది. కళగల ముఖం. రహీమ్‌కి చూడగానే నచ్చింది.

ఫోటో కవరు జేబులో పెట్టుకున్నాడు .

"ఈవాళ వుండి, రేపు సాయంత్రం క్రిష్ణా ఎక్స్‌ప్రెస్‌కి వెళ్తాను. ఎల్లుండి హైదరాబాదులో ఒక అర్జంట్ పనివుంది. మీ వూర్లో మంచి హోటలేదో చెప్పండి" ఎటాచ్ అందుకుని లేచాడు భూషణం.

"ఎంతమాట. మీరొస్తున్నట్లు ముందుగా తెలిసుంటే నేనే రూమ్ బుక్‌చేసి వుంచేవాణ్ని. వుండండని" ఎదురింటి కుర్రోణ్ని పిలిచి ఆటో తెప్పించాడు.

దార్లో "మీరు తెలుగువాడికన్నా తెలుగు బాగా మాట్లాడుతున్నారు" అన్న నాగభూషణం పొగడ్తకు మురిసిపోయాడు రహీమ్.

స్టేషన్ దగ్గర్లో వున్న హోటల్ బ్లూమూన్‌లో ఎ. సి. సింగిల్ రూమ్‌కి తనే డబ్బు చెల్లించాడు. సి. ఎల్. పెట్టి వస్తానని చెప్పి బయల్దేరాడు. రెసప్షన్ నుంచి రమణమూర్తికి ఫోన్‌చేసి భూషణం వచ్చిన సంగతి చెప్పాడు. సాయంత్రం పార్టీ గురించి మాట్లాడాడు వెంచయ్యకూ, శర్మకూ నువ్వు చెప్పు అని ఫోన్ పెట్టేసాడు

స్కూల్లో పనులు చూసుకుని సరిగ్గా పన్నెండు గంటలకు రూమ్‌కి వచ్చాడు.

"వేడి వేడి నీళ్ళు స్నానంచేసి, రెండు గంటలు పడుకుని లేచాక బడలిక తీరింది" నవ్వుతూ ముందు తనే మాట్లాడాడు నాగభూషణం.

"భోజనం యిక్కడికే తెప్పించమంటారా ?' వినయంగా అడిగాడు రహీమ్.

మీల్స్ సెక్షన్‌కే వెడదామని ఎటాచ్‌లో పర్సు జేబులో పెట్టుకుని గదికి తాళం వేసాడు భూషణం

కారిడార్‌లో నడుస్తూ – 'ఈ ప్రపంచంలో భోజనానికి మించింది లేదని నా అభిప్రాయం. నా మటుకు నేను ఎక్కువ ప్రాముఖ్యం, విలువ యిచ్చేది తిండికే' అంటూ నవ్వాడు.

మెనూ కార్డు చూసి రహీమ్ ఆర్డరిచ్చాడు. బిర్యానీ, తందూరీ చికెన్, ప్రాన్ పకోడా, ఫిష్ కట్‌లెట్ – ఎగ్ పుడింగ్.

నాగభూషణం తందూరీ చికెన్ నములుతూ రహీమ్‌కేసి చూసి, 'మీరేమీ తింటున్నట్లులేరు' అన్నాడు.

నిజంగానే కడుపునిండినట్లు ఆకలనిపించడం లేదు రహీమ్‌కి.

"మీరు చాలా పూర్ యీటర్‌లా వున్నారు చూడగా. మా చెల్లెలు కోడికుర్మా బ్రహ్మాండంగా చేస్తుంది" మధ్య మధ్య మాట్లాడుతూ తింటున్నాడు భూషణం.

భూషణం పెరుగన్నంలోకి వచ్చేసరికి రహీమ్ తినడం పూర్తయింది. భూషణం చటుక్కున తలెత్తి 'మీకో విషయం చెప్పనా ?' అన్నాడు.

"చెప్పండి" కుతూహలం కనబరిచాడు రహీమ్.

"అతి సంతోషం, విచారం కలిగినప్పుడు కంట్లో నీళ్ళు తిరగడం సహజం. ఔనా ? నాకేమో తృప్తిగా భోజనం చేసినప్పుడు కన్నీళ్ళు ఆగవు."

'నిజమా ?!' అన్నట్లు చూసాడు రహీమ్.

నాగభూషణం కళ్ళు తడిగా మెరుస్తున్నాయి.

రహీమ్‌కి సంతోషం, తృప్తి కలిగాయి. పర్సు తీయబోయిన నాగభూషణాన్ని వారించి బిల్లు చెల్లించాడు.

రహీమ్ ఏమీ మాట్లాడక ముందు నాగభూషణమే చెప్పాడు. 'కడుపునిండా భోజనం పెట్టించారు. రెండుగంటలన్నా పడుకుంటేగాని భుక్తాయాసం తీరదు. నన్ను మీరు ఐదుగంటలకు కలుసుకోండి.'

సాయంత్రం స్వయంగా వచ్చి తీసుకువెడతాననీ, చిన్నపార్టీ యేర్పాటు చేశాననీ చెప్పి సెలవు తీసుకున్నాడు రహీమ్.

* * *

రహీమ్ పిలిచిన వాళ్ళందరూ పార్టీకి వచ్చారు. పేరు పేరునా ఒక్కొక్కర్నీ నాగభూషణానికి పరిచయం చేసాడు. రమణమూర్తికి మాత్రం భారతి ఫోటో చూపించాడు.


మాటల మధ్య రహీమ్ గుణగణాలనీ, స్కూల్లో అతనికున్న వ్యవహార దక్షతనీ, స్నేహానికి అతనిచ్చే విలువ, పేద విద్యార్థులకు అతను చేసిన సహాయం రహీమ్ గురించి చాలా గొప్పగా చెప్పారు పార్టీకి వచ్చినవాళ్ళు.


రమణమూర్తి, "రహీమ్ నాకు నాలుగేళ్ళుగా తెలుసు. ఆవిడ యేమాత్రం రహీమ్‌కి తగిన యిల్లాలు కాదు. ఇతనుగాబట్టి యిన్నేళ్ళు ఆవిడతో కాపురం చెయ్యగలిగాడు" అన్నాడు.

రహీమ్ ఎక్కువ మాట్లాడలేదు. ఆ తర్వాత సంభాషణ రాజకీయాలమీదికి మళ్ళింది నాగభూషణం తన వుద్యోగ సమయంలో కాంట్రాక్టర్లు, రాజకీయనాయకులు తమనెలా యిబ్బంది పెట్టారో చెప్పాడు.

పార్టీ సంతృప్తిగా ముగిసింది.

ఆ రాత్రి నాగభూషణం రహీమ్‌ని పక్కన



కూర్చోబెట్టుకుని సర్వీసు వివరాలు, మొదటి భార్య గురించి కొన్ని ప్రశ్నలు అడిగి తెలుసుకున్నాడు.

"రేవు మీరు సెలవు పెట్టకండి. శర్మ, మూర్తిగార్ల అడ్రస్ యిస్తే వాళ్ళని విడిగా కలుసుకుంటాను. ఆ తర్వాత వూరు చూసి సాయంత్రానికి రూమ్‌కొచ్చేస్తాను. మీరు వచ్చేటప్పుడు భారతి ఫోటోలు మర్చిపోకుండా పట్టుకురండి." అని చెప్పాడు.

రహీమ్‌కి ఫోటోలు యివ్వాలనిలేదు. అందువల్ల వెంటనే జవాబు యివ్వలేదు.

అది కనిపెట్టినట్లు "మీ ఫోటోకూడా ఒకటి పట్టుకురండి. భారతికి చూపిస్తాను. తనకి నచ్చితే మిగత విషయాలన్నీ నేను చూసామ గాబట్టి మంచిరోజు చూసి, రమ్మని మీకు రాస్తాను ఆడ పెళ్ళి వాళ్ళంగా అప్పటివరకూ మా జాగ్రత్తలో మేముండాలి."

అతను చెప్పింది సబబుగానే తోచింది రహీమ్‌కి

ఆ రాత్రికి రాత్రి శర్మనీ, మూర్తినీ కలుసుకుని ఎలాగన్నా యీ పెళ్ళి కుదిరేలా చూడండని చెప్పి యిల్లు చేరుకున్నాడు.

* * *

మరుసటి రోజు సాయంత్రం ఆరు గంటలకు పావుగంట ముందే హోటల్ బ్లూమూన్ చేరుకున్నాడు రహీమ్. నాగభూషణం గదిలో దిగాలుగా, నీరసంగా కూర్చునివున్నాడు.

పలకరింపుగా నవ్వాడు రహీమ్. నాగభూషణం ముఖాన నవ్వు లేదు. రహీమ్ గతుక్కుమన్నాడు. నిన్న రాత్రి వరకూ ఫేవర్‌గానే వున్నాడు. యింతలో— రహీమ్ ఆలోచన శర్మ మీదికి పోయింది.

"భూషణంగారూ! అలా వున్నారేమిటి?" పలకరించాడు.

ఒకసారి కళ్ళెత్తి చూసి వూరుకున్నాడు భూషణం.

రహీమ్ పై ప్రాణాలు పైనే పోయాయి. భూషణాని కెదురుగా కూర్చోటానికి ధైర్యం చాలలేదు.

"భూషణంగారూ! ఏం జరిగింది?" సందేహిస్తూ, భయంగా తగ్గుస్వరంతో మళ్ళీ పలకరించాడు.

"పర్సు పోయింది." ఆ మాట చెప్పడానికి నామోషీగా ఫీలయ్యాడు భూషణం.

విన్న తర్వాత రిలీఫ్‌గా ఫీలయ్యాడు రహీమ్. ఆదుర్దాగా అడిగాడు.

# పెళ్ళి కుదిరింది

"ఎంతుండాలి సార్? ఎక్కడ పోయింది? పోలీస్ రిపోర్ట్ యిచ్చారా?" నిట్టూర్చాడు నాగభూషణం.

"ఇంట్లో అందరికీ జాగ్రత్తలు చెప్తుంటాను. అటువంటిది పొరుగూరొచ్చి నేనే యిలా పర్సు పోగొట్టుకోడం—" వేళ్ళతో నుదురు రుద్దుకున్నాడు.

"టి. యం. ఒ. ద్వారా డబ్బు తెప్పించుకోవాలన్నా మూడు రోజులు పడుతుంది. రేపు హైదరాబాదులో ఒక అర్జంట్ పని వుంది. అసలు ఆ పనిమీద బయల్దేరే రెండూ కలిసొస్తాయని యిటొచ్చాను."

ఏంచెయ్యాలో తోచనివాడిలా అస్థిమితంగా కుర్చీ వెనక్కి జారబడి కళ్ళు మూసుకున్నాడు.

"ఎంత మాట సర్. మీరు మా వూరొచ్చి డబ్బు పోగొట్టుకున్నందుకు నేనెంతో విచారిస్తున్నాను. పొరపాటన్నది ఎవరికన్నా జరుగుతుంది. మీకు పావుగంటలో డబ్బు తెచ్చిస్తాను. ఈ ట్రైనుకే వెళ్ళండి."

"అదికాదు రహీమ్. మీ వూర్లో కాలు పెట్టింది మొదలు మళ్ళీ మా వూరు చేరేవరకూ యిక్కడ జరిగిందంతా పొల్లుపోకుండా తనకి చెప్పాలని మా భారతి నా దగ్గర మాట తీసుకుంది. నీ దగ్గర డబ్బు తీసుకున్నట్లు చెప్తే —"

"ఇందులో తప్పేముందిలెండి. మీకీ వూర్లో యెంకెవరూ తెలీదుగాబట్టిగానీ లేకపోతే యీ విషయం నాకసలు చెప్పేవారా?" మొహమాట పడుతూ అన్నా నిజాయితీగా అన్నాడు రహీమ్.

"నాదే పొరపాటు. కొంత ఎటాచ్‌లో పెట్టుకోవలసింది." తన అజాగ్రత్తకి తననే నిందించుకుంటూ పశ్చాత్తాపపడ్డాడు భూషణం.

"భూషణంగారూ! మీరు తయారుగా వుండండి. పావుగంటలో వస్తాను." అంటూ లేచిన రహీమ్‌తోపాటు భూషణమూ లేచి నిల్చున్నాడు.

"వెళ్ళగానే మీ డబ్బు మనియార్డర్ చేస్తాను. ఈ సహాయం చెయ్యండి."

ఆ మాటకు చాలా యిదయిపోయాడు రహీమ్.

"ఇక ఆ విషయం ఆలోచించకండి. ట్రైన్ టయిమవుతుంది" అని అతని జవాబుకి ఎదురు చూడకుండా బయటికి నడిచాడు.

పావుగంటలో వెయ్యిరూపాయిలతో తిరిగొచ్చాడు

"రహీమ్‌జీ! మీ స్నేహితులు మీ గురించి చెప్పింది విని పొగడ్త అనుకున్నాను"... ఆపైన మాట్లాడలేకపోయాడు నాగభూషణం.

"పదండి సార్!" ఎటాచ్ అందుకుని దారి తీసాడు రహీమ్.

హైదరాబాదుకి ఫస్టుక్లాసు టికెట్ తీసుకున్నాడు. రెండు మాగజైన్లు, రెండు ఏపిల్ పళ్ళు కొనితెచ్చాడు.

బండి ప్లాట్‌ఫామ్‌మీదికి వచ్చేసింది. నాగభూషణం సీట్లో కూర్చున్నాడు. గార్డు పచ్చ జండా చూపించాడు. బండి కదిలింది.

"మీరు వెళ్ళగానే వుత్తరం రాయండి" బండితోపాటు నడుస్తూ అన్నాడు రహీమ్.

"నీ పెళ్ళి కుదిరిందనే అనుకో" చనువుగా, స్నేహపూర్వకంగా రహీమ్ భుజం తట్టాడు నాగభూషణం.

"అలాగే — అలాగే!" దూరం జరిగి రెండు చేతులూ జోడించి నమస్కరించాడు.

రైలు వెళ్ళిపోయింది.

* * *

ఆశగా, ఆత్రుతగా నమ్మకంగా వుత్తరం కోసం ఎదురు చూడసాగాడు రహీమ్.

రెండువారాలు గడిచినాయిగానీ జవాబులేదు.

ఆదుర్దాని అణచుకోలేక రహీమ్ వుత్తరం రాసాడు.

జవాబులేదు.

ఎదురు చూసి చూసి మళ్ళీ రాసాడు.

నాగభూషణం వెళ్ళి మూడునెలలు కావస్తోంది.

రహీమ్ అయోమయంలో పడిపోయాడు. సహనాన్ని కోల్పోయాడు. నాగభూషణానికి, భారతికి విడివిడిగా వుత్తరాలు రాసి రిజిస్టర్ పోస్టు చేసాడు.

పదిహేనురోజుల తర్వాత రెండు రిజిస్టరు కవర్లూ తిరిగొచ్చాయి. భూషణానికి రాసిన కవరు మీద ఒక మూల ఎర్రసిరాతో యిలా రాసుంది —

ఈ పేరుగల వ్యక్తి యీ గ్రామములో రెండు నెలలనుండి లేడు. కావున వాపసు చేయడమైనది.

రెండవ కవరుమీద :

ఈ పేరుగల ఆమె యీ వూర్లో ఎవరూ లేరు. కావున వాపసు చేయడమైనది.

రహీమ్ బుర్ర గిర్రున తిరిగిపోయింది.

దగా, మోసం!! ఇప్పుడు నలుగురికీ మొహం చూపించుకోడం ఎలా?

రెండు చేతులతో తలపట్టుకుని కూర్చుండిపోయాడు రహీమ్. ★

